మౌనంగా ఉన్నారంటే..

సెబీ చీఫ్ మాధవి పురి బచ్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ కొత్త సందేహాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై తాజాగా వచ్చిన అక్రమాల ఆరోపణలపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కొత్త అనుమానాలను లేవదీసింది. ఇంత జరుగుతున్నా మాధవి పురి ఏం మాట్లాడకుండా ఉన్నారంటే ఏదో జరిగే ఉంటుందన్నట్టు వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోతే ఎందుకీ మౌనం? అంటూ ప్రశ్నించింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఆయా కంపెనీల నుంచి చెల్లింపులు జరిగాయని, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు మాధవి పురిపై వస్తున్న విషయం తెలిసిందే. కాగా, అదానీ అక్రమాలపై గత ఏడాది సంచలన రిపోర్టును తీసుకొచ్చిన హిండెన్‌బర్గ్.. ఈ వ్యవహారంలో సెబీ చీఫ్‌గా మాధవి పురి, ఆమె భర్తకూ లింకులున్నాయని గత నెల బయటపెట్టిన సంగతి విదితమే. దీన్ని అదానీ గ్రూప్, పురి దంపతులు కొట్టిపారేశారు.

కార్వీ ఖాతాలు జప్తు

కార్వీ స్టాక్ బ్రోకింగ్, ఆ సంస్థ సీఎండీ సీ పార్థసారథిలకు చెందిన బ్యాంక్-డీమ్యాట్ ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్‌ను జప్తు చేయాలని గురువారం సెబీ ఆదేశించింది. దాదాపు రూ.25 కోట్ల బకాయిల వసూలుకుగాను ఈ ఆదేశాలు జారీ చేసింది. క్లయింట్ల నిధులను పవర్ ఆఫ్ అటార్నీ దుర్వినియోగంతో కాజేసిన కేసులో భాగంగానే సెబీ ఈ చర్యలకు దిగింది.

అడ్వాన్స్ ట్యాక్స్‌కు టైమైంది

ఈ నెల 15 దాటితే 15% అదనపు పన్ను భారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: ట్యాక్స్‌పేయర్లూ అడ్వాన్స్ ట్యాక్స్‌కు సమయం ఆసన్నమైంది. సెప్టెంబర్ 15 సమీపిస్తున్నది మరి. ఈలోగా ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించకపోతే 15 శాతం అదనపు పన్ను చెల్లింపుల భారం తప్పదు. రూ.10,000, ఆపై మొత్తాల్లో పన్నులు చెల్లించాల్సి వస్తున్న వ్యక్తులు, సంస్థలు ప్రతీ ఆర్థిక సంవత్సరం 3 నెలలకోసారి అడ్వాన్స్ ట్యాక్స్‌లు చెల్లించాలన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ నెల 15తో రెండో త్రైమాసికం కోసం చెల్లించాల్సిన గడువు తీరిపోతున్నది. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వర్గాలు ట్యాక్స్‌పేయర్లను అప్రమత్తం చేస్తున్నాయి. సకాలంలో చెల్లించకపోతే ఆలస్యానికిగాను సదరు మొత్తాలపై వడ్డీలను వసూలు చేస్తారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతీ త్రైమాసికం అడ్వాన్స్ ట్యాక్స్‌లను చెల్లించాలి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం జూన్ 15 డెడ్‌లైన్. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) కోసం సెప్టెంబర్ 15. మూడు, నాల్గో త్రైమాసికాలకు డిసెంబర్ 15, మార్చి 15 గడువు తేదీలు. ఏటా షెడ్యూల్ ఇలాగే ఉంటుంది.



గురువారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో సీఐఐ నిర్వహించిన పవర్ ప్లాంట్ సదస్సు సందర్భంగా ఈ ఏడాదికిగాను ఎనర్జీ ఎఫీషియన్సీ అవార్డును అందుకుంటున్న రామగుండం ఎన్టీపీసీ ఆపరేషన్ విభాగం జీఎం సింఘారాయ్, ఏజీఎం మనోజ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

తొలిసారి 83,000కు సెన్సెక్స్

ఇంట్రా-డేలో దాటిన సూచీ

1,440 పాయింట్ల వృద్ధితో రికార్డు హై 82,963 వద్ద ముగింపు

నిఫ్టీ సైతం 470 పాయింట్లు పెరిగి మొదటిసారి 25,389 దగ్గరకు

ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద

ముంబై, సెప్టెంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రికార్డులతో హోరెత్తించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ.. రెండూ సరికొత్త ఇంట్రా-డే, క్లోజింగ్ హైలను నమోదు చేశాయి. ఉదయం ఆరంభం నుంచే దూకుడు మీదున్న మదుపరులు.. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూపోయారు. ఈ క్రమంలోనే మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ తొలిసారి 83,000 స్థాయిని అధిగమించింది. ఆఖరి గంటలో జరిగిన ట్రేడింగ్‌లోనైతే 1,593.03 పాయింట్లు లేదా 1.95 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 83,116.19 వద్దకు వెళ్లింది. అయితే ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో చివరకు 1,439.55 పాయింట్లు లేదా 1.77 శాతం పెరుగుదలతో ఆల్‌టైమ్ హై 82,962.71 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 470.45 పాయింట్లు లేదా 1.89 శాతం ఎగబాకి లైఫ్‌టైమ్ హై 25,388.90 వద్ద నిలిచింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో 514.9 పాయింట్లు లేదా 2 శాతం పుంజుకొని మొదటిసారి 25,433.35 స్థాయిని తాకింది.

రంగాలవారీగా..

బుల్ రన్‌తో దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే స్థిరపడ్డాయి. రంగాలవారీగా చూస్తే.. మెటల్ ఇండెక్స్ అత్యధికంగా 3.05 శాతం పెరిగింది. టెలికం (2.61 శాతం), విద్యుత్తు (2.02 శాతం), ఆటో (1.99 శాతం), యుటిలిటీస్ (1.93 శాతం), కమోడిటీస్ (1.85 శాతం) షేర్లూ రాణించాయి. షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 0.79 శాతం చొప్పున పెరిగాయి.

కలిసొచ్చిన గ్లోబల్ ట్రెండ్

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌లు వడ్డీరేట్లను తగ్గించబోతున్నాయన్న సంకేతాలు.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టాయి. ఈ జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ కనిపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషించారు. ఇక విదేశీ మదుపరుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పెట్టుబడులు కూడా ఈక్విటీ మార్కెట్లను పరిగెత్తించాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు భారీగా పెరిగాయి. చైనా సూచీ మాత్రం స్వల్పంగా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లూ ఆకర్షణీయ లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి.

తిరుపతి బాలాజీ భళా

మార్కెట్‌లోకి ప్రవేశించిన తొలిరోజే శ్రీ తిరుపతి బాలాజీ అగ్రో ట్రేడింగ్ కంపెనీ లిమిటెడ్ షేర్లు అదిరిపోయే లాభాలను సొంతం చేసుకున్నాయి. ఏకంగా 17.51 శాతం చొప్పున విలువను పెంచుకున్నాయి. ఇష్యూ ధర రూ.83గా ఉంటే బీఎస్ఈ లిస్టింగ్ రూ.92.90 వద్ద జరుగడం గమనార్హం. దీంతో ట్రేడింగ్ మొదట్లోనే 11.92 శాతం వృద్ధి దక్కింది. మదుపరులు ఈ షేర్లను కొనేందుకు విపరీతమైన ఆసక్తి చూపడంతో చివరకు రూ.97.54 వద్ద ముగిసింది. దీంతో 17.51 శాతం పెరిగినట్టైంది. గురువారం ట్రేడింగ్ సమయం ముగిసే నాటికి సంస్థ మార్కెట్ విలువ రూ.795.64 కోట్లుగా ఉన్నది. కెమికల్స్, అగ్రోకెమికల్స్, ఫుడ్ మైనింగ్, వేస్ట్ డిస్పోజల్ ఇండస్ట్రీ, వ్యవసాయ పరిశ్రమలు, లూబ్రికెంట్స్, వంటనూనెలు తదితర రంగాల్లో ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

467 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో ఎగిసింది. గురువారం ఒక్కరోజే బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,59,895.19 కోట్లు పెరిగి రూ.4,67,36,045.21 కోట్ల (5.57 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. వచ్చే వారం జరిగే పాలసీ సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న అంచనాలు.. దాదాపు అన్ని షేర్లకు కొనుగోళ్లే మద్దతునిచ్చాయని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సీ అన్నారు.

జీసీసీల అడ్డా తెలంగాణ: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీఎఫ్ లైఫ్ టెక్ కొత్త గ్లోబల్ కాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభంతో తెలంగాణ.. ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సెంటర్ వల్ల ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేండ్లలో ఈ సంఖ్య 500 దాటగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటైన జీఎఫ్ లైఫ్ టెక్ జీసీసీని గురువారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కేంద్రం నుంచి జీఎఫ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందించగలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఒక్కరోజే రూ.2,000 పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: వెండి ధరలు గురువారం భారీ ఎత్తున పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రూ.2,000 ఎగబాకి రూ.87,000 పలికింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో కదలాడుతున్నాయి. మరోవైపు బంగారం ధర తగ్గింది. 24 క్యారెట్ తులం రూ.250 దిగి రూ.74,350గా ఉన్నది. 22 క్యారెట్ రూ.74,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.73,150గా ఉంటే, 22 క్యారెట్ 10 గ్రాములు రూ.67,050గా ఉన్నది. బుధవారంతో చూస్తే రూ.100 మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 2,547.70 డాలర్లు, సిల్వర్ 29.16 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

ప్రాజెక్ట్ ఇంక్లూజన్‌తో మహిళలకు చేయూత: వీ-హబ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మహిళలకు చేయూతనిచ్చేలా ప్రాజెక్ట్ ఇంక్లూజన్ ఎంతగానో సహకరిస్తుందని వీ-హబ్ సీఈవో సీతా పల్లాచొల్ల తెలిపారు. గురువారం ఇక్కడి వీ-హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ ఇంక్లూజన్ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీ-హబ్ కృషి చేస్తున్నదన్నారు. అదేవిధంగా మహిళలు అంతా ప్రెన్యూర్లుగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు. కాగా, మోడల్ ఎంఎస్ఎంఈల అభివృద్ధి, స్థాపనకు 6 నెలలపాటు ప్రాజెక్ట్ ఇంక్లూజన్ సాగుతుందని సీత స్పష్టం చేశారు. దీనికి రీసస్టైనబులిటీ సంస్థ సీఎస్ఆర్ భాగస్వామిగా ఉందని వెల్లడించారు.

ప్లాస్టో ప్లాంట్‌లో రెన్యువబుల్ ఎనర్జీనే

హైదరాబాద్, సెప్టెంబర్ 12: ప్లాస్టిక్ నీటి ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీలో ప్రముఖ సంస్థగా ఉన్న ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. తమ తయారీ కేంద్రాన్ని పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీతోనే నడిపిస్తున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 52 ఎకరాల్లో ఉత్పాదక కేంద్రం ఉన్నది. దీని నెలవారీ ఉత్పత్తి సామర్థ్యం 20 కోట్ల లీటర్ల వాటర్ ట్యాంకులు. కాగా, నాగ్‌పూర్ ప్లాంట్ 100 శాతం రెన్యువబుల్ ఎనర్జీ ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌గా మారడానికి సమీపంలోగల నండూర్భార్‌లోని రెండు విండ్‌మిల్స్‌లో తయారైన గ్రీన్ ఎనర్జీనే దోహదం చేసినట్టు సంస్థ తెలిపింది.

మందగమనంలో పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి మందగించింది. ఈ ఏడాది జూలైలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4.8 శాతానికే పరిమితమైంది. నిరుడు జూలైలో 6.2 శాతంగా ఉండటం గమనార్హం. తయారీ, గనుల రంగాల పేలవ ప్రదర్శనే ఈ క్షీణతకు కారణమని గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. గతంతో పోల్చితే గనుల రంగంలో ఉత్పాదకత 10.7 శాతం నుంచి 3.7 శాతానికి, తయారీ రంగంలో 5.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో స్వల్పంగా పెరిగి 3.65 శాతంగా నమోదైంది. అంతకుముందు జూలైలో 3.6 శాతంగా ఉన్నది.

పునరావాస ఇండ్ల పరిశీలన

కడెం, సెప్టెంబర్ 12: మండలంలోని కొత్తమద్దిపడగ సమీపంలో నిర్మించిన అటవీ పునరావాస ఇండ్లను గురువారం పంచాయతీరాజ్ అధికారులు అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ శంకరయ్య ఇండ్లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఇండ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు కేటాయించిన విషయం తెలిసిందేనని, అయితే రోడ్డు నుంచి లబ్ధిదారుల ఇళ్లలోకి వెళ్లే గ్రావెల్‌పై సీసీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ కమలాకర్, ఏఈ సూర్యతేజా, ఎఫ్ఆర్వో గీత, అటవీ సిబ్బంది. తదితరులున్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలి

నార్నూర్, సెప్టెంబర్ 12 : గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి స్వప్నశీల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని ఎంపల్లి, కొత్తపల్లి(హెచ్), నార్నూర్ గ్రామ పంచాయతీలను ఆమె గురువారం సందర్శించారు. పారిశుధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు చేయించారు. కొత్తపల్లి(హెచ్)ని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు దినేశ్, నిరజ్, మోతీరాం ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కార్యవర్గం

కుంటాల, సెప్టెంబర్, 12: నర్సాపూర్ (జీ) మండల పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు టీ. నరేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గంగాచరణ్, ప్రధాన కార్యదర్శిగా ఆర్మూర్ రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడిగా కే. గంగాధర్, ఉపాధ్యక్షుడిగా పూదరి శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పీ. పావనిని ఎన్నుకున్నారు.

జిల్లా మార్కెటింగ్ అధికారికి సన్మానం

బోథ్, సెప్టెంబర్ 12 : జిల్లా మార్కెటింగ్ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గజానంద్‌ను గురువారం బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి సన్మానించారు. ఆదిలాబాద్‌లోని డీఎంఓ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. బోథ్ మార్కెట్ పరిధిలో మార్కెట్ కమిటీ యార్డులో పంట కొనుగోలు కోసం అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. సన్మానించిన వారిలో బోథ్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్రార్, ఆపరేటర్ ముజిబ్ ఉన్నారు.

టీపీయూఎస్ కమిటీ ఎన్నికలు

ఇంద్రవెల్లి, సెప్టెంబర్12 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్)నూతన మండల కమిటీ అధ్యక్షులుగా గేడం కేశవ్‌రావ్, ఉపాధ్యాయులుగా రూపావత్ రాంకుమార్, ప్రధానకార్యదర్శి జాదవ్ మేఘనాథ్, కార్యదర్శులుగా ఆడే కిరణ్, శ్యామల, విజయలక్ష్మి, కోశాధికారిగా రాథోడ్ శ్రీకాంత్, సహాయ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ. డిప్యూటేషన్లను రద్దు చేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, అదనపు పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

బోథ్, సెప్టెంబర్12 : మండలంలోని కుచులాపూర్‌లో గురువారం మాల సంక్షేమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నాయకులు ఎల్కరాజు, ఊశన్న, సురేందర్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సింగారి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా ఆకుల సాగర్, ప్రధాన కార్యదర్శిగా బెంబెరి భూమేశ్, ప్రచార కార్యదర్శిగా భూతి రాజు, కార్యదర్శిగా మైలా నరేశ్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిని సత్కరించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ముథోల్, సెప్టెంబర్, 12 : నిర్మల్ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అమీర్ ఖుస్రో, పీడీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభకనబర్చిన 10వ తరగతి విద్యార్థులు గణేశ్, లక్ష్మణ్‌కు ఉపాధ్యాయులు అభినందించారు. వీరు నిర్మల్‌లో ఈ నెల 14 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

మొదటిసారిగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు ప్రారంభం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 12 : స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును జిల్లాలో మొదటిసారిగా ప్రారంభించబోతున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, పీఎంకేవీవైపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా ఎన్ఎస్‌డీసీ ప్రశాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును మొదటిసారిగా ప్రారంభించబోతున్నామని అందుకు ఆయా కళాశాల, పాఠశాలలో విద్యార్థులకు ఏ కోర్సులో ప్రవేశానికి ఇష్టపడుతున్నారో తెలుసుకొని కోర్సుల వారీగా ఐడెంటిఫై చేయాలని కోర్సుల వారీగా 10 నుంచి 40 మంది విద్యార్థులు ఉండాలని ఒరియంటేషన్ ద్వారా తెలిపారు. అనంతరం ఎన్ఎస్‌డీసీ ప్రశాంత్ పీఎంకేవీవై గురించి క్లుప్తంగా ప్రిన్సిపాల్‌కు వివరించారు. ఈ పథకం 15 సంవత్సరాల నుంచి ఆ పైబడిన నిరుద్యోగ యువత, పాఠశాల లేదా కళాశాల డ్రాపౌట్‌లను ఉపాధికి సరిపోయేలా చేసేందుకు ఖర్చు-రహిత పరిశ్రమ-సంబంధిత నైపుణ్య శిక్షణను అందిస్తున్నదని, ఈ పథకం చెల్లుబాటు అయ్యే ధ్రువీకరణ స్కిల్ ఇండియా కార్డును అందిస్తుందని, దీని ఆధారంగా అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని, జీవనోపాధిని పొందవచ్చునని వివరించారు. సమావేశంలో డీఈవో ప్రణీత, ఉపాధ్యాయులున్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

సార్వజనిక్ వినాయకుడి వద్ద మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

మాజీ మంత్రి జోగు రామన్నను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

ఎదులాపురం, సెప్టెంబర్ 12 : సనాతన హిందూ ధర్మం నుంచి ఆనవాయితీగా వస్తున్నటువంటి వినాయక చవితి వేడుకల్లో యువత భాగస్వామ్యమవుతూ గణేశ్ ఉత్సవ వేడుకలను నిర్వహించడం గొప్ప విజయాలకు సంకేతమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట్‌లోని సార్వజనిక్ గణేశ్ మండల్ వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని సార్వజనిక్ యూత్ సభ్యులు కందుల చాణిక్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యూత్ సభ్యులు జోగు రామన్నను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, చాణక్య నిఖిల్, ప్రణీత్, కిట్టు, కార్తీక్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత పరికరాల ఎంపిక

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,12: నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో గురువారం దివ్యాంగులకు ఉచిత పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని సారంగాపూర్, దిలావర్‌పూర్, సోన్, లక్ష్మణ చాంద, నిర్మల్ రూరల్, నిర్మల్ అర్బన్ మండలాలకు చెందిన దివ్యాంగులు ఈ శిబిరానికి వచ్చారు. అన్ని మండలాల ఎంపీడీవో ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసి సదరం సర్టిఫికెట్లు, యూఐడీ కార్డులు ఉన్న వారికి ఎంపిక నిర్వహించారు. కార్డులు లేని వారికి ఐడీ నంబర్ మీసేవ నుంచి తెచ్చుకుని దరఖాస్తు చేసుకున్నారు. వీల్‌ఛైర్, చంకకర్రలు, బ్యాటరీ సైకిళ్ల కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, దివ్యాంగుల సంఘం నాయకులు సట్టి సాయన్న, సాక్‌పెల్లి సురేందర్, ఇసాక్ అలీ, బండి పోతన్న, ప్రవీణ్, నర్సయ్య, కైసర్, పాల్గొన్నారు.

కవ్వాల్ పునరావాస గ్రామంలో వైద్య శిబిరం

కడెం, సెప్టెంబర్ 12: కవ్వాల్ టైగర్ జోన్ రాంపూర్, మైసంపేట నుంచి పునరావాస గ్రామానికి వచ్చిన ప్రజలకు గురువారం నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ క్యాంపు, యునాని వైద్య శిబిరం వైద్యాధికారి శివకుమార్ ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 79 మందిని పరీక్షించి జ్వరంతో బాధపడుతున్న 9 మందిని గుర్తించి వారి రక్తనమూనాలు సేకరించి అనంతరం వారికి చికిత్స అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 39 మందికి రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఇతరాత్ర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్, హెచ్‌ఈవో వేణుగోపాల్, సిబ్బంది నిర్మల, మౌనిక, జ్యోతి, రాజేశ్వర్, స్వర్ణ, అమృత పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేజీఎంను కలిసి ఎంపీ, ఎమ్మెల్యే

ఎదులాపురం, సెప్టెంబర్ 12 : దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను గురువారం హైదరాబాద్ సికింద్రాబాద్‌లోని రైల్వే నివాసంలో ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు కలిశారు. రైల్వేకు సంబంధించిన పలు ప్రతిపాదనలు అందజేశారు. త్వరలో ప్రారంభించనున్న సికింద్రాబాద్- నాగపూర్ వందే భారత్ రైలు హాల్ట్‌ను సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉండేటట్లు చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రైల్వే జనరల్ మేనేజర్ త్వరలో ఆ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

జైనథ్, సెప్టెంబర్ 12 : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించాలని విద్య శాఖ మండల నోడల్ అధికారి మద్ది లస్మన్న అన్నారు. గురువారం మండలంలోని బెల్గావ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కనీస సామర